కథ


డా|| రోష్ని

**మేం మొత్తం పది- పదిహేనుమందిమి, మంచి స్నేహితులం.**

సంవత్సరంలో రెండు- మూడుసార్లు కలుస్తాం. కష్ట సుఖాలు, కవిత్వం, కథలు, కాకరకాయలు- ఇలా ఎన్నో విషయాల గురించి కలబోసుకుంటూ మాకు బాగా నచ్చినవి తిని, తాగి సెలబ్రేట్ చేసుకుంటాం. ఈ సంఖ్య పది- పదిహేను ఎందుకన్నాల్సి వచ్చిందంటే, ప్రతి సమావేశానికి ఓ ముగ్గురు- నలుగురు ఏవో పనుల వత్తిడి వల్ల మిస్సవుతారు.

అది సరే... ఈ మధ్యే మే నెలలో వేసవి సెలవులకి కలిసాం. ప్రోగ్రాం మామూలుగానే నడుస్తోంది. మా చర్చ ఫెమినిజం దగ్గర మొదలై మగ స్నేహితుల (బాయ్‌ఫ్రెండ్స్) వైపు దారితీసింది.

# మగాడు




స్వప్న తన అనుభవం ఒకదాని గురించి చెప్పడం మొదలెట్టింది. కొంచెం... ఆగండి. ఆమె మొదలెట్టక ముందే ఆమె గురించి కొంత చెప్పాలి. చాలా స్వతంత్ర భావాలు కల మనిషి. అనుకున్నది చేసితీరే మనిషి. స్నేహానికి ప్రాణం ఇస్తుంది. పెళ్ళిలాంటి తతంగాలేమీ లేకుండా తనకు నచ్చిన చంద్రతో పదేళ్ళుగా హేపీగా కలిసి వుంటోంది. వాళ్ళమధ్య ఇన్‌సెక్యూరిటీ, ఇన్‌సిన్సియారిటీ లాంటి సమస్యలు కనబడవు. సరే, ఇక విందాం...

స్వప్న చెపుతోంది...

“మొన్నా మధ్య ఓ ఆదివారం చంద్ర స్నేహితులు ఇద్దరు భోజనానికి వచ్చారు. తలో కాస్త బీరు లాగించారు....”

శాంత అందుకుంది “సరే తర్వాత టాయ్‌లెట్‌కి క్యూ కట్టి వుంటారు. అంతేనా, ఇంకేమైనా ఇంటరెస్టింగ్ విషయం వుందా...”

స్వప్న శాంతని కోపంగా చూసి, “నీ జోకులు కాస్త ఆపు తల్లీ. నేను చెప్పేది పూర్తయ్యాక అప్పుడు వెయ్యి నీ జోకులు” అన్నది.

“సారీ! మధ్యలో మాట్లాడనులే” అని చెప్పి శాంత చేతులు కట్టుకుని, నోటిమీద వేలేసుకుని ఎల్‌కేజీ పిల్లలా కూర్చుంది.

మేమంతా మళ్ళీ నవ్వబోయి, స్వప్న మొహం చూసి, కొంచెం సీరియస్‌గా మారి... “సరే నువ్వు త్వరగా అసలు విషయం చెప్పు” అన్నాం.

స్వప్న కొనసాగించింది.

“టైం తొమ్మిదయింది. భోంచేసేద్దాం అనుకున్నాం. చంద్ర వడ్డించడానికి వంటగదిలోకెళ్ళాడు. సాయం చేయడానికి చంద్ర ఫ్రెండ్ ఒకడు లేచి ఆయన వెంటే వంటగదిలోకెళ్ళాడు. హాల్లో నేను మరొకాయన మాత్రం మిగిలాం. ఆయన నా దగ్గరకొచ్చి భుజం మీద నొక్కుతూ చాలా ఇన్‌డీసెంట్‌గా మాట్లాడాడు. నాకు ఏం చేయాలో దిక్కు తోచలేదు. ఆయన చేతుల్ని విదిల్చికొట్టి నేను కూడా వంటగదిలోకెళ్ళి పోయా. ఆ తర్వాత అతనితో మాట్లాడ్డానికి చాలా ఇబ్బందనిపించింది...”

నెర్వస్‌గా చేతులు నలుపుకుంటూ చెప్తోంది స్వప్న.

“మనలో ప్రతి అమ్మాయికి జీవితంలో ఏదో ఒక టైమ్‌లో ఇలాంటి అనుభవం జరిగే వుంటుంది. అలా జరిగిన ప్రతిసారీ మనమే ఏదో తప్పు చేశాం అని కుమిలిపోవడం మామూలే. ఇక్కడే మనం మారాల్సింది. ఎవడో చేసిన వెధవ పనికి గిల్టీగా ఫీలయిపోతూ బతకాల్సిన అవసరం మనకి లేదనుకుంటా...” ఇంకా ఏదో చెప్పబోతోంది మా ఏక్టివిస్టు ఫ్రెండ్ అనూ.

"అబ్బ! అసలు విషయం అది కాదు-" స్వప్న కసురుకుంది. మరేంటి అనబోయి శాంత గబుక్కున మళ్ళా నోటిమీద వేలేసు కుంది.

"ఈ విషయం మర్చిపోయి చాలా రోజులయింది. ఈ మధ్యే మరో విషయం తెలిసింది. ఫెమినిస్టులంటే చాలా ఫ్రీగా ఉంటారనుకున్నాడట.కానీ వాళ్ళకు కాస్ట్ ఫీలింగ్ కూడా ఎక్కువేనంట. అతను నాకంటే తక్కువ కులం వాడయినందుకే అతని సరసాన్ని తిప్పికొట్టానని ప్రచారం చేస్తున్నాడాయన..."

అందరం ఒక్కసారి తెల్లబోయాం. ఇలా క్కూడా ఆలోచిస్తారా.

"ఫెమినిస్టులు ఫ్రీగా ఉంటారు అంటే అర్థం ఏమిటి. ఆల్వేస్ ఎవైలబుల్ అనా" విరుచుకుపడ్డది ఇందిర.

ఆమె కోపం చూసి మేం జడుసుకున్నాం.

ఇంతలో.. "తన కోపమె తన శత్రువు... శాంతించండి, శాంతించండి. విరుగుడు తీసుకోండి" అంటూ ట్రేలో గ్లాసులు తలా ఒకటి అందించింది శాంత.

తర్వాత మా చర్చ చాలా మలుపులు తిరిగింది. సింగిల్ ఉమెన్, డబల్ రిలేషన్‌షిప్స్, ఒంటరి తల్లులు, జంటలేని తండ్రులు, ఓల్డ్ ఏజ్డ్ పేరెంట్స్- ఇలా ఇలా తిరుగుతూ జరుగుతున్న మా చర్చ శాంత నోరు తెరిచి ఏదో చెప్పబోయేసరికి మేం అందరం పిన్‌డ్రాప్ సైలెన్స్ పాటించాం. ఎందుకంటే శాంత ఇటువంటి చర్చల్లో అందరి కథనాలు, కథలు వింటుంది. విన్నదాన్లో ఏదో ఒక విషయం గురించి జోక్ కట్‌చేసి అందరినీ నవ్విస్తుంది. మేం కొన్ని విషయాల గురించి చాలా ఆవేశంగా మాట్లాడుకుంటున్న సందర్భంలో కూడా ఏదో ఒక జోకేసి వాతావరణాన్ని మళ్ళీ మామూలు చేసేస్తుంది. తన సొంత విషయాలు ఎక్కువగా మాట్లాడేది కాదు. అలాంటిది మొహం అంతా సీరియస్‌గా పెట్టేసి తీవ్రంగా ఆలోచిస్తూ, నేను చెప్పేది వినండి అని చేతుల్తో సైగలు చేస్తూ మా నోళ్ళు మూయించింది.



అద్దె భారమైనా సరే, నేను ఒక పేలస్ లాంటి ఇంటిలో ఉంటున్నాను. బోల్డన్ని గదులు, పెద్ద హాలు... ఇంటి వోనర్స్ మంచివాళ్ళు. వారివల్ల సింగిల్ విమెన్ (ఇంటిగల వారితో) పడే బాధలేవీ వుండేవి కావు. కాని చాలాసార్లు రాత్రులు నేనా విశాల భవనంలో ఒంటరిగా మిగిలిపోయే దాన్ని. నా కూతురు పిన్నింటికో, ఫ్రెండింటికో వెళ్ళిపోయేది. నా బోయ్‌ఫ్రెండ్ అసలు వచ్చేది వారానికోసారో, నెలకోసారో...

"శీనూని నేను ముఖాముఖీ కలుసుకుని మాట్లాడింది చాలా తక్కువ సార్లే... మా పరిచయానికి కేవలం నాలుగేళ్ళే వయసు. ఈ నాలుగేళ్ళలో మేం కలిసింది కూడా నాలుగుసార్లే.

నాలుగేళ్ళ క్రితం-

నేను విదేశాల్నుంచి తిరిగొచ్చిన తొలి రోజులు. విజయవాడలో మొదటిసారి శీనుని చూసాను. అప్పుడు ఏదో దినపత్రికలో సన్‌డే ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నట్టున్నాడు.మొదటి పరిచయం రోజునే, 'నువ్వేదో రచయిత్రివంటగా. మాకు ఆర్టికల్స్ రాయి. వేసుకుంటాం-" అన్నాడు.

నేనింకా భూమిమీద అడుగుపెట్టినట్టు లేదోయ్. ఇంకా విమానంలో తిరుగుతున్నట్టుగా వుంది.బహుశా దీన్నే జెట్‌లాగ్ అంటారనుకుంటా. నేనేమీ రాయలేను- అన్నాను.

రెండోసారి మళ్ళీ విజయవాడలోనే కలిసాం. "ఆర్టికల్స్ ఏవీ"- శీను డిమాండ్.

"నీ పత్రిక ద్వారా నాకేదో పబ్లిసిటీ రావడం నాకిష్టం లేదు"- ఇదీ నా పొగరుబోతు సమాధానం.

తిరిగి మళ్ళీ ఎప్పుడూ ఆర్టికల్స్ గొడవ ఎత్తలేదు. ఆ విధంగా శీను బతికుండగా వాడికోసం నేనేమీ రాసివ్వలేకపోయాను. మూడోసారి కలుసుకున్నది హైదరాబాద్‌లో మా ఇంట్లో. విజయవాడ నుంచి హైదరాబాదు పనిమీద వచ్చానన్నాడు. ఏదో పిచ్చాపాటి మాట్లాడి వెళ్ళిపోయాడు.

తర్వాత వాడు విజయవాడ నుంచి వచ్చేసి హైదరాబాదులో సెటిలయిన ఆరు నెలలకి ఇక్కడే ఉంటున్నాడని తెలిసింది. చాన్నాళ్ళు మేం కలుసుకోలేదు. కనీసం ఫోనులో కూడా మాట్లాడుకోలేదు. నాకు అప్పట్లో ఫోను లేదు...

మరి ఫోనొచ్చాక ఏమయిందో అని మేం ఆసక్తిగా వినడానికి కాళ్ళు కాస్త సర్దుకుని కూర్చోబోతుంటే- "ఒక్క నిముషం" అంటూ లేచివెళ్ళి గ్లాసులు నింపుకొచ్చింది శాంత. నింపుకొచ్చిన గ్లాసులు చూసి మేం సంతోషించినా స్టోరీ నెరేషన్‌ని డిలే చేస్తున్నందుకు కాస్త విసుగ్గా వుంది....

"సరే! నాకు ఫోను వచ్చాక, ఓ అర్ధరాత్రి ఫోను చేసాడు. అదీ ఇదీ మాట్లాడుతూ ఓ ముసలాడి గురించి (నా బోయ్‌ఫ్రెండ్ గురించి లెండి) నా టైమంతా వేస్టు చేసుకుంటున్నానని, నా బతుకు చూస్తుంటే రోతగా ఉందని ఏదేదో మాట్లాడాడు. నా సొంత విషయాల్లో నీ జోక్యం అనవసరం అని ఫోను పెట్టేసా. కాని ఇప్పుడనిపిస్తోంది- వాడు చెప్పిన దాంట్లో బోల్డంత నిజముందని" ఇలా అని తన గ్లాసులోకి చూస్తూ చాలాసేపు మౌనంగా ఉండిపోయింది. జ్ఞాపకాలను నెమరేసుకుంటూ మళ్ళీ చెప్పుకొచ్చింది.

"నాలుగోసారి కలిసినప్పుడు మాత్రం ఒక రాత్రంతా మా ఇంట్లోనే ఉన్నాడు (వెరీ ఇంట్రస్టింగ్. కథ ఏదో మలుపు తిరుగుతుందనుకున్నాం). శీను గురించి కొంత తెలిసింది నాకు ఆ రాత్రే. అదేవిధంగా అంటే...

అద్దె భారమైనా సరే, నేను ఒక పేలస్‌లాంటి ఇంటిలో ఉంటున్నాను. బోల్డన్ని గదులు, పెద్ద హాలు... ఇంటి వోనర్స్ మంచివాళ్ళు. వారివల్ల సింగిల్ విమెన్ (ఇంటిగల వారితో) పడే బాధలేవీ వుండేవి కావు. కాని చాలాసార్లు రాత్రులు నేనా విశాల భవనంలో ఒంటరిగా మిగిలిపోయేదాన్ని. నా కూతురు పిన్నింటికో, ఫ్రెండింటికో వెళ్ళిపోయేది. నా బోయ్‌ఫ్రెండ్ అసలు వచ్చేది వారానికోసారో, నెలకోసారో...

నేనొంటరిగా ఇంట్లో మిగిలిపోయానని వాళ్ళకెప్పుడూ తట్టదనుకుంటా... సరే, అలాంటి ఒక రాత్రి... నా కూతురు ఈసారి అమ్మమ్మ దగ్గరకెళ్ళింది. నా బోయ్‌ఫ్రెండ్ వచ్చే సూచనలేమీ లేవు. నాకు నిద్ర రాదు. నాతో మాట్లాడ్డానికెవరూ లేరు. నిద్రపడుతుందేమోనని కొద్దిగా వైను తాగాను. నిద్ర రాలేదు, సరికదా- ఎవరికన్నా ఫోను చేసి మాట్లాడాలనే ఉత్సాహం వచ్చేసింది. శీనుకే ఫోను చేసాను. ఒంటరి తనం, బోరు అంటూ ఏదో మాట్లాడా...

నన్ను రమ్మంటావా అని అడిగాడు.

నేను- 'ఓ యస్! చేపల పులుసు కూడా ఉందిరా. నీకు చాలా ఇష్టం కదా' అన్నాను.

గంటయ్యింది. గంటన్నరయ్యింది... శీను వస్తున్న జాడ లేదు. అంతలో ఫోను మోగింది. దారి తెలియడం లేదు, ఫలానా చోట ఉన్నాను. అక్కడి నుంచి ఎలా రావాలి అని ఫోను చేసాడు. ఈ ఇంట్లోకి మారాక శీను ఎప్పుడూ రాలేదు మరి.

దారి చెప్పి ఫోను పెట్టేసా. అలా మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చే సరికి చాలా లేటయింది. అప్పటికే రాత్రి 11 గంటలయింది.

తనకో విస్కీ బాటిల్, నాకో జిన్ సీసా తెచ్చాడు. నేనెప్పుడో నాలుగేళ్ళ క్రితం నేను ఇష్టపడేవి ఒకటి ఓడ్కా, రెండోది జిన్ అని అన్న మాటలు గుర్తుంచుకుని నా కోసం 'జిన్' తెచ్చాడంట. నాకు వాడిమీద బోల్డంత ప్రేమ కలిగింది. కానీ నేను ఆ 'జిన్' తాగనని చెప్పాను. నాకు తాగుడన్నా, తాగుబోతులన్నా అసహ్యం పుట్టుకొస్తోందన్నాను. (ఛేంజ్ ఈజ్ లా ఆఫ్ లైఫ్ అనుకుంటా...)

శీను విస్కీ తాగాడు. నేను మరికొంచెం వైన్ తాగాను. అప్పటికింకా మేం భోంచేయలేదు. నేనప్పుడు ఒంటరిగా లేననే ఆనందం వల్లో, ఏమిటో నాకు ఆకలి లేదు.

నిద్ర ముంచుకొస్తోంది.

అయినా శీను బోల్డన్ని కబుర్లు చెపుతూనే ఉన్నాడు. నేను వింటూనే ఉన్నా...

ఏవేవో పాత పాటలు గుర్తుచేసి నన్ను పాడమని అడిగాడు.

నాకు ట్యూను గుర్తుంటుంది గాని పాట, సాహిత్యం గుర్తుండి చావదు. మాటలన్నీ మార్చేసి, కొన్ని సార్లు పేరడీలు చేసి పాడతా. ఎలా పాడినా శీను చాలా బావుంది అంటూ విన్నాడు. కేసెట్లు విన్నాం. మెహదీహసన్, కార్పంటెర్స్, జగజీత్‌సింగ్, పండిత్ జస్‌రాజ్- అంతా కలగాపులగం చేసి వింటున్నాం.



(మేం, అనగా పదిమందిమీ ఉత్కంఠతో చస్తున్నాం. అలానే వింటున్నాం.)

శీను సడన్‌గా అడిగాడు 'తనతో పడుకోమని' నేనేమీ షాకవ్వలేదు. అలా పడుకోడం తప్పనీ నేను అనుకోలేదు. కానీ పడుకోవాలనే కోరిక, తొందర, ఆత్రం నాలో ఏమీ లేవు. అయినా సింగిల్ వుమన్ అనగానే అడిగిన ప్రతీ మగాడితో పడుకోవాలని ఏమన్నా రూలుందా... ఇలాంటి రూలు ఈ మగాళ్ళంతా కలిసి పాస్ చేసినట్లున్నారు... వీళ్ళకెంత కొవ్వు... అహంకారం... ఇలా నాలో నేను స్వగతంగా ఆలోచిస్తూ... ఊరికే వాడేమిటో తెలుసుకోవాలనిపించింది.

ఒరేయ్! నన్ను పెళ్ళి చేసుకుంటావా అని అడిగాను.

"నీకు పిచ్చేమిటి. సింగిల్‌గా వుండటంలోనే బోలంత ఆనందం వుంది. దానికి నిదర్శనం నువ్వూ, నేను" అన్నాడు.

మళ్ళా నాలో నేను...

సింగిల్‌గా ఉన్నందుకు నువ్వు మగాడివి కాబట్టి హేపీగానే ఉంటావు. ఫెమినిజానికి రకరకాల అర్థాలు చెప్తారు. మీ కోరికలకు అనువుగా మలచుకుంటారు. సింగిల్ వుమెన్ సైకాలజీని మీకు పనికొచ్చేలా వాడుకుంటారు. కాని, నాలాంటి వాళ్ళు హేపీగా ఉండాలన్నా అడ్డంకులెన్నో. ఒక ఆడదాన్ని తనతో సమానమైన వ్యక్తిగా గుర్తించి గౌరవించే మగవాడెవడయినా ఉన్నాడా...

పైకి మాత్రం ప్రశాంతంగా (లోపల బాగా గిల్టీగా ఫీలవుతూ...) వాడితో "నీతో పడుకోవాలనిపించడం లేదురా...!" అన్నాను.

ఇంకా ఏదో అనబోతూ తలెత్తి చూసేసరికి శీను నా ముందు లేదు. హర్టయ్యాడేమోననిపించింది. ఇంటికెళ్ళిపోయాడేమో... పోతే పోనీయ్... నాకు నిద్ర పట్టేసింది..."

మళ్ళా శాంత గ్లాసులోకి చూస్తూ ఉండిపోయింది. ఛ... కథ చప్పబడిపోయింది అనుకున్నాం మేం.

ఓ సిప్ తీసుకుని మళ్ళీ తనే ప్రారంభించింది.

"తెల్లారింది... లేచి హాల్లోకెళ్తే, అక్కడ పరుపుమీద పసి పిల్లాడిలా నిద్రపోతూ శీను...

వాడి మొహంలో బోల్డంత అమాయకత్వం... బోల్డంత ముద్దొచ్చాడు.

శీనూని లేపాను. "ఒక్కసారి నన్ను కావిలించుకో" అన్నాను.

మేం కావిలించుకున్నాం. ఆ కావిలింతలో మోహం లేదు. కోరిక లేదు. ఉద్రేకం లేదు. సెక్సు లేదు.

అంతా ప్రశాంతత... కొండంత ధైర్యం... అంతే! శీను తన ఇంటికెళ్ళిపోయాడు.

ఏ శారీరక అనుభవం లేని ఆ రాత్రి, శీను మీద ప్రేమే గాకుండా బోల్డంత గౌరవం కలిగేలా చేసింది. ఎందుకంటే, ఆ రాత్రి నేనున్న పరిస్థితుల్లో ఏ మగాడయినా నన్ను సులువుగా బలవంతం చేసి ఉండొచ్చు. ఫిజికల్‌గా నేనూ ఎలానూ వీకే కదా...

చెప్పడం మరిచాను- శీను బలంగా, చూడ్డానికి అందంగా కూడా ఉండేవాడు.

లేదా, ప్రేమిస్తున్నాను... పెళ్ళి చేసుకుంటాను అని మభ్యపెట్టి లొంగదీసుకొనీ ఉండొచ్చు.

కానీ శీను అలా చేయలేదు.

వాడి నిజాయితీ నాకు నచ్చింది.

నా ఇష్టాయిష్టాల్ని గుర్తించి గౌరవించిన మొదటి. చివరి వ్యక్తి శీను...

ఏ శారీరక అనుభవం లేని ఆ రాత్రి, శీను మీద ప్రేమే గాకుండా బోల్డంత గౌరవం కలిగేలా చేసింది. ఎందుకంటే, ఆ రాత్రి నేనున్న పరిస్థితుల్లో ఏ మగాడయినా నన్ను సులువుగా బలవంతం చేసి ఉండొచ్చు. ఫిజికల్‌గా నేనూ ఎలానూ వీకే కదా... చెప్పడం మరిచాను- శీను బలంగా, చూడ్డానికి అందంగా కూడా ఉండేవాడు. లేదా, ప్రేమిస్తున్నాను... పెళ్ళి చేసుకుంటాను అని మభ్యపెట్టి లొంగదీసుకొనీ ఉండొచ్చు. కానీ శీను అలా చేయలేదు.

తర్వాత మేం ఎప్పుడూ కలుసుకోలేదు. రెండుమూడుసార్లు ఫోనులో మాట్లాడుకోవడమే. ఓసారి నేను రాసి ఆర్టికల్స్ చూపిద్దామని పిలిచాను. వస్తానని రాలేదు. నేనేం బాధపడలేదు. మా నాన్నగారు జబ్బుపడి ఆసుపత్రిలో ఉండగా నాకు డబ్బు అవసరమయి శీనుని అడుగుదామని ఫోను చేసాను. మాట్లాడాను. కానీ డబ్బు గురించి అడగలేదు.

చివరిసారిగా శవమై కనిపించాడు.

చావులో కూడా నాకు అందంగా, ముద్దుగా కనిపించాడు. శీను ఇక లేడంటారా... ఎందుకని లేడు... నాకిప్పటికీ వాడి పలకరింపే వినిపిస్తోంది...

'శాంతే! ఏంటి సంగతులు'

నా శీను చావలేదు. నా మనసులో మరపురాని నేస్తంగా మిగిలిపోయాడు...."అంటూ శాంతి భోరున ఏడ్చింది. చాలాసేపు ఏడ్చింది.

భర్త రోగంతో తీసుకుని, తీసుకుని చనిపోయినప్పుడు కూడా అంత ఏడవలేదు.

పోనీలే... సేవలు చేసి, చేసి అలసిపోయింది, ఏడ్చే ఓపిక లేదు అనుకున్నాం.

కానీ ఇప్పుడు... తను ఏడుస్తుంటే చూస్తూ ఊరుకుండిపోయాం.

నిశ్శబ్దం గూడుకట్టుకుంది...

దాన్నించి బయటపడ్తూ తనే "ఓ చెంబుడు నీళ్ళివ్వండిరా" అని అడిగి తీసుకుని గటగటా తాగేసి... "నా కథ తెలుగు సిన్మాలాగ పెళ్ళితోనో, మన పమ్మీ కథల్లోలాగ పడుకోడంతోనో ఎండ్ కాలేదని చాలా బాధగా ఉందే" అని గలగలా నవ్వేసి... మళ్ళీ-

"కాదులే, కొంచెం డ్రింకెక్కువయినట్లుంది..." అంటూ రెండు డయాగ్నసిలలో ఏది కన్ఫార్మ్ చేయాలో తెలీక తన సీనియర్ డాక్టర్‌వైపు నిస్సహాయంగా చూసినట్లు మా వైపు చూస్తూ ఉండిపోయింది శాంతి.

## తొలి డిటెక్టివ్ కథేమిటో తెలుసా?

అమెరికాకు చెందిన ప్రఖ్యాత కథకుడు ఎడ్గార్ అల్లెన్‌పో మొదటి డిటెక్టివ్ కథను రాశాడు. *1841*లో ఆయన "మర్డర్స్ యిన్‌ది రూమోర్గ్" అనే డిటెక్టివ్ కథను రాశాడు. అటు తరువాత ఈ సాహిత్య ప్రక్రియ ప్రపంచంలోని అన్ని భాషలకు వ్యాపించింది. సర్ ఆర్థర్ కానన్ డాయల్ (ఇంగ్లాండ్) సృష్టించిన షెర్లాక్ హోమ్స్ డిటెక్టివ్ కథలు ప్రపంచంలో **41** భాషల్లో కొన్ని కోట్ల పుస్తకాలు అమ్ముడయ్యాయి. ఇంకా అమ్ముడవుతూనే వున్నాయి. షార్టుహాండ్‌లో, బ్రెయిలీ లిపిలో (గుడ్డివాళ్ళు చేత్తో చదివే లిపి) కూడా అని అనువదింపబడ్డాయి. అమెరికా డిటెక్టివ్ నవలా రచయిత ఎరల్ స్టాన్‌లెగార్డ్‌నెర్ *(1889- 1970)* నవలలు *23* భాషల్లో *30* కోట్ల ప్రతులు అమ్ముడుపోయాయి. ఆయన సృష్టించిన డిటెక్టివ్ పేరు పెర్రీమేనస్.